

శ్రీ షిర్డీ సాయిబాబా




శ్రీ భరద్వాజ మాస్టర్



శ్రీ సుబ్బరామయ్య గారు



శ్రీ వెంకయ్యస్వామి



శ్రీ దత్తాస్వామి

# శ్రమతో సేవ - సేవతో కైవల్యం

వ్యవస్థాపకులు: శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్ట్     ఎడిటర్స్ : VAS ప్రసాద్, గొర్తి సాయి సుబ్రహ్మణ్యం

శ్రీ సుబ్బరామయ్య సార్ జీవిత విధానం ద్వారా బోధించిన "శ్రమతో సేవ - సేవతో కైవల్యం" ను అనుసరించి మా జన్మలు ధన్యం గావించుటకు ఈ మాసపత్రికను ప్రారంభిస్తున్నాము. శ్రీ సుబ్బరామయ్య సార్ మనకందించిన అనుభవాలను, సాంగత్య స్మృతులను, సార్ ఆచరించి బోధించిన అమూల్య విషయాలను స్మరించుకొనుటకు, మహాత్ములు బోధించిన సత్సంగ, సద్గ్రంధ పఠనలకు ప్రేరణగా ఈ మా చిన్న సేవ.

గమనిక : ఎవరైనా ఈ మాగజైన్ లో తమ వ్యాసాలను, అనుభవాలను పంచుకోదలిచినవారు saimaster.sevatrust@gmail.com కు e-mail చేయగలరు

సంపుటి : 10
సంచిక : 04
భాద్రపద పౌర్ణమి
Sep 26, 2026

## నేపథ్యం
## సామూహిక సాధన

పూజ్యశ్రీ సుబ్బరామయ్య సార్ ప్రవచనం

## ఇష్టాయిష్టాలు

సార్ ఈ ప్రవచనములో మనసులోని ఇష్టా ఇష్టాలు మరియు భావోద్వేగాలే అన్ని మానసిక సమస్యలకు మూలమని, వాటిని నియంత్రించడమే ఆధ్యాత్మిక సాధన యొక్క ముఖ్య ఉద్దేశ్యమని చెపుతున్నారు. మన అహంభావం మరియు ఇతరుల పట్ల ద్వేషం



శ్రీ షిర్డీ సాయిబాబా




శ్రీ భరద్వాజ మాస్టర్



శ్రీ సుబ్బరామయ్య గారు



శ్రీ వెంకయ్యస్వామి



శ్రీ దర్గాస్వామి

లేదా విమర్శనాత్మక ఆలోచనలు మనపై పాపాల బరువును (లోడింగ్) పెంచుతాయని, కాబట్టి ఇతరులను తప్పుపట్టడం మాని సద్గురువును ఆశ్రయించడం అత్యవసరమని వివరించారు.

సపితా సచమే మాతా స బంధుశ్చ సచ దేవతా |
సంసార మోహ నాశాయ తస్మై శ్రీ గురవే నమః

## విషయ సూచిక


| | |
|---|---|
| సంపాదకీయం | 3 |
| భక్తుల అనుభవాలు | 11 |
| శ్రీ సుబ్బరామయ్య సార్ లెటర్లు | 13 |
| సార్ సత్సంగం | 25 |
| మహాత్ముల వాక్యాలు | 31 |



శ్రీ షిర్డీ సాయిబాబా




శ్రీ భరద్వాజ మాస్టర్



శ్రీ సుబ్బరామయ్య గారు



శ్రీ వెంకయ్యస్వామి



శ్రీ దర్గాస్వామి






## సద్గురు శ్రీ  సుబ్బరామయ్య మహారాజ్


శ్రీ షిర్డీ సాయిబాబా

శ్రీ భరద్వాజ మాస్టర్

శ్రీ సుబ్బరామయ్య గారు

శ్రీ వెంకయ్యస్వామి

శ్రీ దర్గాస్వామి

## సంపాదకీయం

ఓం సాయిరాం

సద్గురువు సన్నిధికి రాకముందు, మనము తెలిసో తెలియకో మిశ్రమ కర్మలు చేస్తూ ఉంటాము. మంచి కర్మలు, చెడు కర్మలు — రెండూ మన జీవితంలో జరుగుతూనే ఉంటాయి. ఎప్పుడైతే మన మంచి కర్మలు ఎక్కువై, పుణ్యం పెరుగుతుందో, అప్పుడు సద్గురువు మనలను దగ్గరకు తీసుకొని, మనకు కావలసిన జీవిత పాఠాలను తన ప్రవర్తనతో, తన జీవన విధానంతో, తన దివ్య లీలలతో మనలను ఆశ్చర్యంలో ముంచి ప్రేమ మార్గంలో నేర్పి, మనము ఉన్న స్థితి నుంచి శాశ్వత తృప్తి, శాంతి, ఆనందం కలిగే ఉన్నత స్థితికి తీసుకువెళుతారు.

సద్గురువు దగ్గరకు వచ్చిన తర్వాత ఆయన అనుగ్రహంతో మనకు గురుమిత్రులు, గురుబంధువులు ఏర్పడతారు. ఎందుకంటే, మనము ఒకరితో ఒకరు కలిసి, సామూహికంగా సాధన చేసే అవకాశాన్ని సద్గురువు కల్పిస్తారు. సామూహికంగా కలిసి పనిచేసేటప్పుడు మన పనితీరు మాత్రమే కాదు, మన భావం కూడా క్రమంగా శుద్ధి చెందుతుంది. అందువల్ల సద్గురువు సన్నిధికి మరింత దగ్గరయ్యే అవకాశం ఏర్పడుతుంది. సద్గురువు సన్నిధి అంటే కేవలం ఆయన దగ్గర భౌతికంగా ఉండడం మాత్రమే కాదు. సద్గురువు సన్నిధి అంటే — సకల చరాచర జగత్తు ఎవని రూపమో, ఆ రూపాన్ని అంతటా దర్శించగలిగే అవగాహన, అనుభూతి కలగడం. మన దృష్టి మారి, జగత్తంతటా సద్గురువు రూపాన్ని దర్శించే స్థితికి చేరుకోవడం.

అందువల్ల సద్గురువు సన్నిధికి వచ్చిన మనము, ఆయన గురుబంధువులతో ఎలా ధర్మబద్ధంగా, సామరస్యంగా నడుచుకున్నారో గమనించాలి. సద్గురువు ఇచ్చిన సూచనలు, ఆయన జీవన విధానం, ఆయన చేసిన పనులు — ఇవన్నీ మన సామూహిక సాధనకు మార్గదర్శకాలు కావాలి.

ఈ విషయంలో సుబ్బరామయ్య సార్ గారి జీవితం మనకు ఒక మంచి ఉదాహరణ.

సార్ శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్ట్ కమిటీని ఏర్పాటు చేసిన తర్వాత, ఏ నిర్ణయం అయినా సరే అందరి అభిప్రాయాలను సేకరించి, దాని ప్రకారం చేసేవారు. అంతేగాక ఆ నిర్ణయాలను (Resolutions) ఒక పుస్తకములో పొందుపరిచేవారు. సుబ్బరామయ్య సార్ గారి గురించి బాగా తెలిసిన కమిటీ సభ్యులు, "సార్, ఇవన్నీ ఎందుకు? మీరు ఏది నిర్ణయిస్తే దాని ప్రకారం వెళ్దాము" అని చెప్పేవారు. అయినప్పటికీ సార్ అందరి అభిప్రాయాలను గౌరవంగా విని, నిర్ణయం తీసుకునేవారు.

అంతేకాకుండా, కమిటీ సభ్యుల ప్రశ్నలను, సందేహాలను సావధానంగా విని, తగిన విధంగా స్పందించేవారు. కొన్ని కీలక విషయాలలో వెంకయ్య స్వామిని అడిగి, చీట్లు వేసి నిర్ణయం చేసేవారు.

కొన్ని ఉదాహరణలు మచ్చుకు చూద్దాం

శ్రీ సాయి మాస్టర్ నిలయంలో పనిచేసే ఇద్దరు కేర్‌టేకర్లు భక్తులతో అనుచితంగా ప్రవర్తించినప్పుడు కూడా, ఆ విషయాన్ని కమిటీ సభ్యులతో ప్రస్తావించి, వెంకయ్య స్వామి దగ్గర చీట్లు వేయించి నిర్ణయం తీసుకున్నారు.

ఇక్కడ మనము గమనించవలసినది కేవలం ఆయన తీసుకున్న నిర్ణయం కాదు; నిర్ణయం తీసుకునే విధానం. అందరి అభిప్రాయాలను గౌరవించడం, సందేహాలను ఓపికగా వినడం, అవసరమైనప్పుడు గురువును ఆశ్రయించడం — ఇవన్నీ మనకు ఆయన చూపించిన జీవన పాఠాలు.

అలాగే, సుబ్బరామయ్య సార్ గారు తాను అంతకుముందు చేసిన దాన్ని వెనక్కి తీసుకొని, తనంతట తానే సరిదిద్దుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి.

1. ఒకసారి ఒక ఆడ కుక్క సాయి మాస్టర్ నిలయంలోకి బయట నుంచి చాలా వేగంగా వస్తుండగా, సార్ దాన్ని అదిలించారు. అది సాయి మాస్టర్ నిలయానికి ఆనుకుని ఉన్న సుబ్బరామయ్య సార్ గారి ఇంట్లోకి వెళ్లింది. తర్వాత సార్ దాన్ని గమనించి, అది ఆడ కుక్క అని, గర్భవతిగా ఉందని, కొన్ని కుక్కలు తరమడం వల్ల ఇంట్లోకి వచ్చిందని తెలుసుకున్నారు. చిత్రంగా ఆ తర్వాత ఆ కుక్క తన జీవితాంతం శ్రీ సాయి మాస్టర్ నిలయంలోనే ఉన్నది. అది గర్భవతిగా ఉన్నప్పుడు, సుబ్బరామయ్య సార్ గారు ప్రతిరోజూ అన్నంలో పంచదార కలిపి, కుక్క నోటికి హితంగా ఉంటుందని ఆహారాన్ని స్వయంగా పెట్టేవారు.

2. సార్ వ్రాసిన అవధూత అవధూత లీల(పసుపు రంగు అట్ట) లో టైపింగ్ తప్పులను ఒకాయన వచ్చి సారు కి చెబితే సార్ ఎంతో హుందాగా తీసుకొని ఆ గ్రంథంలో  తప్పులు ఉండకూడదు అని చెప్పి ఒక యజ్ఞం లాగా ప్రూఫ్ రీడింగ్ చేయించి ప్రింట్ చేశారు.

3. సుబ్బరామయ్య సార్ గారు ఏకనాథ స్వామి జీవిత చరిత్ర చదివినప్పుడు, ఏకనాథుడు రాసిన భాగవతాన్ని గంగలో వదిలేయమని చెప్పిన సందర్భంలో, ఆయన ఏమాత్రం బాధపడకుండా, చెప్పిన వారి రూపంలో కృష్ణుడే అలా చెప్పాడని భావించి గంగలో వదిలేస్తాడు. వెంటనే గంగాదేవి ఆయనకు ఆ పుస్తకాలను శరీర రూపంలో ప్రత్యక్షమై అందించడంతో, అక్కడ ఉన్న ప్రజలందరూ ఏకనాథుడి గొప్పతనాన్ని గుర్తిస్తారు.

సుబ్బరామయ్య సార్ గారు భక్త తుకారాం సినిమాలో “అభంగాలను నదిలో వేయమంటే తుకారాం గారు వేస్తారు. ఆ తర్వాత ఆయన బాధపడుతున్నట్లు” ఉన్న సంఘటనను, ఏకనాథ స్వామి జీవితంలోని సంఘటనను బేరీజు వేస్తూ భగవంతుని అంతటా చూస్తున్న ఏకనాధుని గొప్పతనాన్ని చెప్పేవారు.

కొన్ని నెలల తర్వాత, ఒక భక్తురాలు హిందీలో ఉన్న భక్త తుకారం జీవిత చరిత్రను తెలుగులోకి తర్జుమా చేసి సుబ్బరామయ్య సార్ గారికి ఇచ్చారు. అది చదివినప్పుడు, భక్త తుకారం జీవిత చరిత్రలో కూడా, అభంగాలను నదిలో వేయమన్నప్పుడు ఆయన ఏమాత్రం బాధపడకుండా వేయడం, వారం రోజుల తర్వాత ఆ అభంగాలను నదీమాత శరీర రూపంలో సురక్షితంగా తిరిగి ఇవ్వడం వంటి సంఘటన ఉన్నట్లు సార్ గారు గుర్తించారు. దాని తర్వాత ఒక భక్తుడితో భక్త తుకారాం సినిమాలో ఎంత తప్పుగా చూపించారు అన్నారు. ఆ తరువాత ఏకనాథుడు, భక్త తుకారాం సంఘటనలను బేరీజు వేసిఎప్పుడూ చెప్పలేదు.

ఈ సంఘటనలు మనకు ఒక ముఖ్యమైన విషయాన్ని చూపిస్తాయి— మనకు ఏదైనా విషయం తరువాత స్పష్టమైతే, ముందుగా

చేసిన పనిని సమర్థించుకోవడం కాకుండా, మనలను మనమే సరిదిద్దుకోవాలి.

మహాత్ముల జీవితాలలో ఇటువంటి సంఘటనలు ఎన్నో ఉంటాయి. వారి నిష్కల్మషమైన మనస్సుకు, భగవంతుని మీద విశ్వాసం, భగవంతుడినే అంతటా చూస్తున్నారు అనటానికి కొన్ని మచ్చుతునకలు ఈ సంఘటనలు. వారు అతి సామాన్యుల వలె ధర్మాన్ని అనుసరిస్తూ "యద్యదాచరతి శ్రేష్ఠః" అన్నరీతి నడుచుకుంటారు. వారి ఆచరణను ఆదర్శంగా తీసుకుంటూ మనము సాముహిక సాధన అవగాహనతో చేసుకోవాలి.

అందువల్ల మహనీయుల జీవితంలోని ప్రతి చిన్న సంఘటన నుంచీ మనము నేర్చుకోవాల్సిన విషయం ఎంతో ఉంది. మనము ఎంతమేరకు మనలను ఆయనకు సమర్పించి, ఆయన అడుగుజాడల్లో నడవడానికి ప్రయత్నిస్తామో, అంతమేరకు ఆయన చూపించిన మార్గం మనకు అర్థమవుతుంది; ఆ అనుభూతి మనలో పెరుగుతుంది.

ఇక్కడ ఒక ముఖ్యమైన విషయం మనము గుర్తుంచుకోవాలి. సద్గురువును అనుసరించడం అంటే ఆయనను అనుకరించడం కాదు. ఆయన చేసిన పనులను యథాతథంగా కాపీ చేయడం కాదు. ఆయన ఏ భావంతో ఆ పనులను చేశారో, ఆ భావాన్ని అర్థం చేసుకొని, అటువంటి భావముతో, స్ఫూర్తితో మన జీవితంలో మన పరిస్థితులకు అనుగుణంగా ఆ భావంతో చేయడానికి ప్రయత్నించడం చేయాలి.

అందువలన ప్రతి ఒక్కరము, మనలను దగ్గరకు తీసుకున్న సద్గురువు జీవితంలోని సంఘటనలను —— అవి ఎంత చిన్నవైనా సరే —— ఒకచోట వ్రాసుకోవాలి. వాటిని పదేపదే స్మరించుకోవాలి. "ఇంత చిన్న

విషయంలో ఏముంది?" అని నిర్లక్ష్యం చేయకూడదు. సద్గురువే మన హృదయంలో కూడా ఉన్నారు. కాబట్టి మనము ఆయన జీవిత సంఘటనలను స్మరించుకుంటూ, ఆయన ఆలోచనలను అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తే, ఆయన మన మనసును, మన ఇంద్రియాలను తన ఆలోచనలతో స్పృశింపజేసి, క్రమంగా పునీతం చేస్తారు.

అందువల్ల సామూహిక సాధన అంటే కేవలం కలిసి ఒక పని చేయడం కాదు. భగవంతుని స్మరించుకోవడం, సద్గురువు ఏమి చేశారు, ఎలా చేశారు, ఏ భావంతో చేశారు అనే విషయాలను మరల మరల గుర్తు చేసుకోవడం, ఆ భావంతో మనము కూడా మన స్వంత ఇష్టాయిష్టాలకు అతీతంగా జీవించడానికి ప్రయత్నము చేయాలి.

మనం ఏ పని చేస్తున్నా—ఈ పనిని మన సద్గురువు ఎలా చేస్తారు? ఈ విషయంలో వారు మనకు ఏమి ఉపదేశించారు? అనే స్పృహ మనలో నిరంతరం ఉండాలి. ఆ పనిని లోకపు మెప్పు కోసమో, ధనార్జన కోసమో చేస్తున్నామా, లేక ఆ పని రూపంలో సాక్షాత్తూ సద్గురు సేవనే ఆచరిస్తున్నామా అని మన అంతరంగాన్ని అనుక్షణం పరిశీలించుకుంటూ, భావశుద్ధి చేసుకోవాలి. ఇది కేవలం సేవా కార్యక్రమాలకే పరిమితం కాదు; మన నిత్య జీవితంలో, విధి నిర్వహణలో, వ్యక్తిగత వ్యవహారాల్లో సద్గురువు ఆలోచనలు-ఆచరణలతో మన తీరును బేరీజు వేసుకుంటూ, ఆ సద్గురువు మెచ్చే రీతిలో బాధ్యతలను నిర్వర్తించాలి.

సద్గురువు ( సార్) జీవితమే మనకు ఆదర్శం: మచ్చుకు కొన్ని ఇక్కడ ప్రస్తావిస్తున్నాము.

ఆదర్శ నిర్ధనత్వం: తమకు వచ్చిన ₹5,000 పెన్షన్ మొత్తాన్ని మూడు భాగాలు చేసి, తమ వంతుగా వచ్చిన ₹1,700 లో నెల ఖర్చులకు ₹1,000 మాత్రమే వాడుకుని, మిగిలిన మొత్తాన్ని తమ కోసం దాచుకోకుండా మదర్ థెరిసా ఆశ్రమానికి అందించి ఆదర్శవంతమైన 'నిర్ధనత్వం' ఎలా ఉండాలో ఆచరించి చూపారు.

సామూహిక సత్సంగం & శ్రమదానం: స్వగృహంలో సామూహిక సత్సంగాలు నిర్వహించడమే కాక, బ్రహ్మంగారి మందిరంలో సత్సంగాలు జరిపించారు. ఎన్నో భవన నిర్మాణాలలో కేవలం పనులు చేయించడమే కాకుండా, తాము స్వయంగా అందరితో కలిసి శ్రమదానం చేశారు.

గురుబంధువుల సాంగత్యం: సుబ్బమాంబ గారి వంటి గురుబంధువులతో కలిసి మహాత్ముల దర్శనమూ, సేవా భాగ్యమూ పొందారు.

బాధ్యతాయుత సేవా తత్పరత: శ్రీ వెంకయ్య స్వామి ఆశ్రమంలో కొన్ని వారాల పాటు భోజన వసతి లోపించినప్పుడు, గ్రామ పెద్దలను కలిసి పరిస్థితిని వివరించారు; జిల్లా కలెక్టర్‌కు లేఖల ద్వారా అర్జీలు సమర్పించారు. అంతేగాక, రాజగోపాల్ అయ్యవారి స్వగృహంలో భక్తులకు స్వయంగా అన్నదాన ఏర్పాట్లు చేయించారు.

సేవలో సాయి దర్శనం: విద్యానగర్‌లో పూజ్య భరద్వాజ మాస్టారి సమక్షంలో మందిర నిర్మాణ సేవలో పాలుపంచుకుంటూనే, అక్కడికి వచ్చే భక్తులలోనూ, తోటి సేవకులలోనూ శ్రీ సాయినాథుడినే దర్శిస్తూ, ఆయనకే నివేదిస్తున్నామనే పరమ పవిత్ర భావనతో స్వయంగా వంట చేసి వడ్డించేవారు.

ఎదుటివారి ప్రవర్తన ఎలా ఉన్నప్పటికీ, తమ దృష్టిని చెదరనీయక——ప్రేమ, విస్మయాలతో గురువుపై, మాస్టారిపై నిలిపి, శ్రీ వెంకయ్య స్వామి సేవలో పూర్తిగా లీనమైపోయారు. నెత్తిపై ఉన్న నిండుకుండ తొణకకుండా అత్యంత జాగ్రత్తగా బ్యాలెన్స్ చేస్తూ నడిచే బాటసారిలా——ఏమరపాటు లేకుండా, రాగద్వేషాలనే పాకుడులో జారిపడకుండా, పూర్ణ తృప్తి-ప్రశాంతతలతో వారు ఎలా కడతేరారో స్మరించుకోవడం మనందరిలో నూతనోత్సాహాన్ని నింపుతుంది. సద్గురు సేవ చేయాలనే తపన మనలో దావానలంలా రగిలి కర్తవ్యోన్ముఖులను చేస్తుంది.

ఈ విధంగా మనమందరం సమష్టిగా పనిచేస్తూ, మన పనితీరును, అంతఃచేతనను శుద్ధి చేసుకుంటూ, సద్గురువు చూపిన మార్గంలో పురోగమిద్దాం!

మన సద్గురువు ఆశించినట్లుగా——ఈ చరాచర సృష్టి అంతటా నిండియున్న ఆ సద్గురు దివ్య దర్శనాన్ని మనమందరం పొంది, ఆ బ్రహ్మానుభూతిలోనే స్థిరంగా నిలిచి ఉండేలా అనుగ్రహించమని ఆ శ్రీ సార్ పాదపద్మాలను ప్రార్థిద్దాం!

## భక్తుల అనుభవాలు

ఓం సాయిరాం

ప్రసాదు ఒకరోజు సార్ తో ఇద్దరు వ్యక్తులు ఎవరికి వాళ్లు చెప్పిందే చేయమని అంటూ ఉంటే ఏమి చేయాలి సార్ అని అడిగాడు. సార్ "వాళ్ళిద్దరిని మాట్లాడుకుని ఒక నిర్ణయానికి రమ్మని చెప్పి దాని ప్రకారం చేయటమే" అని చెప్పారు.



శ్రీ షిర్డీ సాయిబాబా




శ్రీ భరద్వాజ మాస్టర్



శ్రీ సుబ్బరామయ్య గారు



శ్రీ వెంకయ్యస్వామి



శ్రీ దత్తాస్వామి

ప్రసాద్ ఒకరోజు సార్ తో “అందరూ నేను చెప్పిన మాటే వినాలి అని అనిపిస్తుంది సార్” అని చెప్పాడు. సార్ దానికి “అందరూ నా మాటే వినాలి అనేది తీసేయాలి” అని చెప్పారు.

బ్రహ్మంగారి మఠం ఎదురుగా పనిచేస్తున్నప్పుడు జరిగిన సంఘటన. ఒకరోజు పనివాళ్ళు పని చేయట్లేదని ఒకాయన అరుస్తున్నారు. ఆ అరుపులకు బెదిరిపోయిన ఇంకొకతను ఆయనను ఎందుకు ఆలా అరుస్తున్నారు అని గట్టిగా అన్నాడు. అక్కడే ఉన్న సార్ తో ‘సార్! పనివాళ్లు పని చెయ్యక పోతే ఏమి చెయ్యాలి’ అనిగాడు. సార్ సావధానంగా “వారి మీద అరవవనక్కర లేదు. తరువాత రోజు నుండి వారిని పనిలోకి పెట్టుకోనక్కర లేదు” అని చెప్పారు.

శ్రీ సార్ పొడుగునా పని స్వామి చేయిస్తున్నారు, స్వామి చేయిస్తేనే అవుతుంది అంఢ్ పూర్ణంగా విశ్వసించి నడచుకోవటం ఆచరణ లో కనిపిస్తుంది. శివకు 2002 లో సార్ కలలో కనపడి నీతో పని ఉంది రమ్మంటారు. వచ్చాక సార్ పుస్తకాలు - గుట్టగా ఉన్నవి అన్ని లెక్క చూసే పని శివకు - రామ కృష్ణ కు అప్పగించి, “చదువుకొనే పిల్లాడివి కదా పిలవటం ఎందుకని పిలవలేదు - ఈ పని కోసమే స్వామి రప్పించారు” అంటారు. సార్ స్వామి కర్తుత్వము పట్ల తప్ప ఎవ్వరిపైనా ఆధారపడి నట్లు ఎప్పుడు కనిపించాడు.

అలానే 2009 సమ్మేళనము నకు మద్రాసునుండి ఒక పెద్దగ పరిచయం లేని భక్తుడు వచ్చి సాయి మాస్టర్ నిలయంలో ఎన్నో పనులు చేసారు. ఇంకొక భక్తునికి ప్రేరేపించి సున్నం వేయిస్తారు - సార్ గా ఆ పనులు ఎలాగ - ఎవరు చేస్తారు అని తర్జన బర్జన పడినట్లు కనపడదు. కాని

ఎవ్వరినీ పిలవరు - ఎవ్వరు పని చేస్తాము అన్నా స్వామి ఆజ్ఞగా అక్కడి అవసరాలకు తగ్గట్లు చెప్పి చేయనిస్తారు. 2008 సాయి మాష్టర్ సమ్మేళనంలో సార్ స్పీచ్ లో కూడా ఆ గుర్తునే నిలుపోకోమని చెబుతారు.

ఓం గురుభ్యోనమః

## శ్రీ సుబ్బరామయ్య సార్ లెటర్లు

4-7-05న శ్రీమతి లక్ష్మక్కకి: స్వామి ఎలా బలహీనతలు బయటకు తెప్పించి వాటిని తీసేస్తారో చెపుతూ

OM

గొలగమూడి

04-07-2005

పూజ్య గురు బంధువు లక్ష్మక్క కు నమస్కారములు,


శ్రీ స్వామివారు మనలోని బలహీనతలు బయటికి రప్పించేందుకు ఎలాంటి పరిస్థితులు ఏర్పరుస్తారో చూడండి. ఆ బలహీనత బయటపడనిదే మనకలాంటి బలహీనత ఉందని మనకు తెలియదు. దానిని పోగొట్టుకునే తీవ్ర ప్రయత్నం చేయము. శ్రీ సాయి మాస్టర్ నిలయం కట్టించి నాలోని ఎన్నో బలహీనతలు ఎలా తొలగిస్తున్నారో చూడండి. మొన్న 20 సంవత్సరాల ఎం.బీ.బీ.ఎస్ చదివే అమ్మాయి దీక్ష చేయాలంటే ఉండమన్నాను. ఆమె ప్రవర్తన నచ్చక ఖాళీ చేయమన్నాను. తప్పు చెప్పమన్నది. చెప్పాను. ప్రమాణాలు చేస్తానన్నది. మాటకు మాట అరిచేసాను.


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాష్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ ధర్గాస్వామి

అసలు అరవడం ఎందుకు? మెల్లగా తప్పు చెప్పకుండానే ఖాళీ చేయి అంతే. మీ తప్పులు చెప్పేందుకు మేము లేము. మీకు 40 రోజులు ఉంచుతామని రాసి ఇవ్వలేదు అని మెల్లగా చెప్తే పోతుంది కదా.

**"వాక్ పౌరుష్యమేవచ అజ్ఞానం అన్నారు" గీతలో- నాకు పౌరుష వాక్యములు ఆడటం చెడ్డ అలవాటు. దానిని పోగొట్టాలని శ్రీ స్వామివారి తపన**.

ఈ శ్రీ సాయి నిలయం కట్టించి, అందులోకి ఆమెను ప్రవేశపెట్టి నా చేత పరుష వాక్యములు అనిపించి, అది తప్పు అని నాకే తెలిపి - అలాంటి సన్నివేశాలు లో శ్రీ స్వామివారు ఎలా ప్రవర్తించారో గుర్తు చేసి- పౌరుష వాక్యములు భవిష్యత్తులో పలుకరాదు అనే నిర్ణయం చేయించారు. **అలాగే ప్రతి వారికి అలాంటి విషమ పరిస్థితులు కలిగిస్తారు. ఆ పరిస్థితులను మనం నేర్పరి అయిన నావికుని వలె ఉపయోగించుకుని మన లోపాలు సరిదిద్దుకోవాలి. మన లోపాలు ఏమిటో తెలియకుంటే కోటికంఠాలతో ఘోషిస్తాడు శ్రీ స్వామి.** శ్రీ స్వామి వారివలే చక్కగా ఆత్మలో బోధ చేయగల వారెవరూ లేరని నా నమ్మకం. శ్రీస్వామి వారి కృప ఎప్పుడూ సదా మనందరికీ ఉండాలని ప్రార్థిస్తూ.

పెసల సుబ్బరామయ్య

*********** సద్గురు దేవా శరణం శరణం ***********

01-08-2005 న లక్ష్మక్క గారికి: మనం భగవంతుని చేతిలో ఉపకరణాలము మాత్రమే.

గొలగమూడి,


1-8-2005


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ ధగ్గాస్వామి

పూజ్య గురుబంధువులైన శ్రీమతి లక్ష్మక్క గారికి పెసల సుబ్బరామయ్య నమస్కారములు.

**అమ్మ మనం ఏదైనా చెయ్యాలన్నా చేయలేము. చేయలేకుండా ఉండాలన్నా ఉండలేము.** ఉదాహరణకు నా కొమార్తె అప్పుడు రైల్వేలో షోలాపూర్ ప్రక్కన హుటిగీ అనే స్టేషన్ లో ఫార్మసిస్టుగా పనిచేస్తుంది. అప్పుడే స్టేట్ బ్యాంకులో ఉద్యోగానికి ట్రైనింగ్ కు  తిరుపతి రమ్మని ఆర్డరు వచ్చింది. రైల్వే పెద్ద సంస్థ అని, స్టేట్ బ్యాంకు చిన్న సంస్థ అని,  స్టేట్ బ్యాంకు లో చేర్చేందుకు నాకిష్టం లేక ఆ ఆర్డరు కాగితం ఆమెకు పంపలేదు. భగవంతుని నిర్ణయం ఆమెను బ్యాంకులో ఉద్యోగం చేయించాలని. గనుక ఆమె పనిచేసే గ్రామంలో ఆ ముందటి రోజు డాక్టరును చంపే ప్రయత్నం చేసారు. ఆ రోజు డాక్టరు లేకుండా ఉంటే మా అమ్మాయికి ఆ మర్యాద జరిగి ఉండేదే. అందుకని తెల్లవారి సామాను సర్దుకుని ఇంటికి రాబోతుంది. అదే సమయంలో నేను షిరిడీ పోవాలనే ప్రేరేపణ పెట్టడంతో బ్యాంక్ ఆర్డరు ఊరక చూపెట్టాలని తీసుకుపోయ్యాను. షిరిడీ పొయ్యే మార్గంలో హుటిగీ, కనుక అక్కడ దిగి ఆమెను చూచి షిరిడీ పోవాలని దిగాను. ఆమె సామాను సర్దుకుని రెడీగా వచ్చేందుకు సిద్ధంగా ఉంది. విషయం తెలుసుకుని షిరిడీ ప్రయాణం మానుకుని తెల్లవారి 10 గం.లకు తిరుపతి ట్రైనింగ్లో చేర్చాలని, వెంటనే హుటిగీ నుండి తిరుపతి వచ్చి ట్రైనింగ్ లో చేర్చాను. నా షిరిడీ ప్రయాణం పోయింది.


నేననుకొన్న షిరిడీ యాత్ర సాగలేదు. భగవంతుని నిర్ణయానుసారం ఆమె స్టేట్ బ్యాంకులో ఉద్యోగి అయింది. బ్యాంకు ఉద్యోగినే వివాహమాడి నెల్లూరులో కాపురమున్నారు.


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దత్తాస్వామి

**మనం ఒక పని చేసేందుకు, చేయకుండా ఉండేందుకు స్వేచ్ఛ లేనివారము. భగవంతుని చేతిలో ఉపకరణాలము మాత్రమే. ఇది తెలిసి దేనికీ చింత చేయకుండా హాయిగా నీ ఇష్టమొచ్చినట్లు నడుపు తండ్రీ అంటూ సంతోషంగా ఉంటే ఈ నాటకరంగంలో మన పాత్ర బాగా నటించిన వారమవుతాము.** అట్లాగాక అంతా నేనే చేస్తున్నాను, పిల్లలను చెడగొడుతున్నాను అనుకోవడం అవివేకం. చెడగొట్టడం, బాగుపరచడం మనచేతిలో ఏమీలేదు. మా అన్నను చదువు కొరకు నెల్లూరులో మా మేనత్తగారింట్లో ఉంచితే బీడీలు త్రాగేది నేర్చుకుని, సాయిబులతో కుస్తీలు పట్టేది నేర్చుకొని చెప్పకుండా ఇంటికి వచ్చేసాడు. ఇక నన్ను చదువుకే నెల్లూరు పంపకూడదనుకొన్నారు. కాని రెండురోజులు పూర్తి నిరాహారదీక్ష చేసి చదువు కొరకు నెల్లూరు వెళ్లి B.Sc., B.Ed అయ్యాను. మనము ఏదీ చేయలేము, చేయకుండా ఉండలేము అంతా దైవమే చేస్తున్నాడు

శ్రీ స్వామి వారి ఆశీస్సులతో,

పెసల సుబ్బరామయ్య

*********** సద్గురు దేవా శరణం శరణం ***********

05-06-2005 న సాయి కి: అంతా స్వామి నడిపించినట్లే నడవగలుగుతాము

గొలగమూడి, 05-06-2005

Dear Sai!

శ్రీ స్వామివారి దయ వలన నీ చదువు బాగా సాగాలని ప్రార్థిస్తున్నాను. మీ ఎరుక లేకుండా మీ రిజల్యూషన్ లేకుండానే మరలా లక్ష రూపాయలు నెలసరి వడ్డీ ఇచ్చేటట్లు శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్ట్ పేరుతో వేశాను. **ప్రతి నెలా వచ్చే వడ్డీ మదర్ థెరిసా అనాథాశ్రమానికి ఇవ్వాలనుకున్నాను**. రేపు

మీరు వచ్చినప్పుడు ఫిక్సిడ్ డిపాజిట్ వేసే ఫారాల మీద అమ్మ సంతకాలు పెట్టాలి.

చూచావా సాయి. మరో అనాథాశ్రమం కట్టాలంటే అది వీలు కాకుండా మదర్ థెరిసా ఆశ్రమాన్ని అనాథాశ్రమంగా చేశారు. **ప్రతిదీ ఇలాగే ఉంటుంది. మన ఇష్టాఇష్టాలు లేకుండా వారు నడిపించినట్లే నడవగలుగుతాము. అయితే ఆ బాట కష్టంగా ఉంటుంది. ఎందుకని? మనకు ఇష్టాఇష్టాలు పోలేదు కనుక. వాటిని ఆ మహనీయుడు** వదలకొట్టేంత **వరకు విశ్రాంతి లేకుండా వెంటపడుతూ మనలను నడిపిస్తుంటారు. కనుక ఇష్టాయిష్టాలు వదలి వారు నడిపించినట్లు ఆడుతుంటే వారికీ శ్రమ ఉండదు, మనకు కష్టం ఉండదు. అదే అన్నమయ్య పాడిన పాట. ఓ దేవాదిదేవా మా ఆటపాటలతో మిమ్ము మెప్పించవలేనేగానీ మోక్షమిమ్మని మిమ్మడగ తగదు. అంటే అర్థం ఇప్పుడు శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్టు నడిచే తీరు అదే.**

నీ చదువులో వారు నిన్ను నడిపించే పద్ధతే అది. నీవు ఏమీ అధైర్యపడకుండా, చింతకు తావివ్వకుండా, Tension లేకుండా నడక సాగించడమే కావలసినది. మనం తప్పు చేయాలన్నా చేయలేము. ఆ కరుణామయుడు తన నాలుగు చేతులతో మనలను రక్షిస్తుంటాడు. మిమ్ములను గొలగమూడికి ఈడ్చిన ఆ మహనీయుని సామర్థ్యము ఏమని చెప్పగలము? నీకు PhD సీటు Roorkee లో వస్తే గొలగమూడికి రాలేవు కదా ! అందుకే మద్రాస్ లో వేయించాడు. ఋణానుబంధాలు తీరాలి. నీటి ఋణం, నిద్ర ఋణం అని ఊరక అనలేదు. అమ్మ ను ఓర్పు వహించి జాగ్రత్తగా దైవ స్మరణ చేయమని చెప్పు. ఎంతో గొప్ప అదృష్టం.

పెసల సుబ్బరామయ్య

*********** సద్గురు దేవా శరణం శరణం ***********

24-06-2005 న సాయికి: మానవుని సమస్య, ఓరిమి; ఆట ఆడటం



శ్రీ షిర్డీ సాయిబాబా




శ్రీ భరద్వాజ మాస్టర్



శ్రీ సుబ్బరామయ్య గారు



శ్రీ వెంకయ్యస్వామి



శ్రీ ధర్మాస్వామి

OM

24-06-2005

Dear sai!

**మానవుని సమస్య ఏమిటి? ఉన్నదానితో అసంతృప్తి లేనిదానికై తపన అంటారు శ్రీ మాస్టారు.** నీవు వారం వారం 15 రోజులకు ఇక్కడకు రావాలంటావు. శ్రీ స్వామివారు మనకిచ్చిన సదవకాశం నీ అసంతృప్తి వలన సద్వినియోగం చేసుకోలేకుండా ఉన్నావు. ఈ ప్రపంచ వాసన లేకుండా నిన్ను I.I.T Campus శ్రీ స్వామివారు నీకు ఒక పని అప్పగించి చేయమంటే, అది కాదు నేను గొలగమూడి లో ఉంటాను, వారం వారం వస్తాను అనడం, ఉన్నదానితో అసంతృప్తి లేని దానికై తపన అనే మానవుని సమస్యను నీవు వదలలేదు. ఆధ్యాత్మికత అంటే గురువు మాటను implicit obedience గా ఆచరించడం అనేది నీ ఆచరణలో వచ్చేంతవరకు శ్రీ స్వామివారి కృప మనం సంపూర్ణంగా పొందలేము. ఎర్రిస్వామి, తిక్క స్వాముల కథ మర్చిపోయావు. తిక్క స్వామి ఎంత గొప్పవాడో! గురువు మాటకు ఎదురు ఒక్క మాట చెప్పకుండా వెళ్ళిపోయాడు. రోశిరెడ్డి కూడా తిక్కస్వామి లాంటి మహనీయుడే.

ఇక్కడుంటే నాకు ఎన్ని బాధలు ఉన్నాయో మీకు తెలుసా? ఎప్పుడూ ఏకాంతంగా కూర్చోనివ్వరు. ఎవరో ఒకరు వస్తారు. ఇంటిలో వారు ఎప్పుడు అక్షింతలు వేస్తుంటారు. ఎందుకు? వాళ్ళను గురించి నేను పట్టించుకోనట. పుస్తకాల అంగడి ఆయన రోజుకు ఒక సమస్య తెస్తాడు. సాయి మాస్టర్ నిలయం తాత రోజుకు 5 లేక 6 సమస్యలు తెస్తాడు. **వీటన్నిటిని తప్పించమని ప్రార్థించాలా? No. ఈ బాధలన్నీ తట్టుకుంటేనే నా మురికి వదులుతుంది. ఋణానుబంధాలు, వాగ్దానాలు తీరాలి కదా. మనకు**

**ఆరోగ్యము, అన్నం పెట్టారు. ఇంకేమి కావాలి. తక్కిన విషయాలన్నీ ఆటలో భాగాలే. ఆట ఆడడం నేర్చుకోవాలి.**

శ్రీ స్వామివారి కృపా సదా మీకు ఉండాలని ప్రార్ధన

పెసల సుబ్బరామయ్య

*********** సద్గురు దేవా శరణం శరణం ***********

25-03-99న శ్రీమతి లక్ష్మక్కకి: శ్రీ మాస్టారు తమకు ఎలా ప్రతి క్షణం నేర్పిస్తున్నారో చెపుతూ

గొలగమూడి, 25-03-1999

పూజ్యులైన శ్రీమతి G. లక్ష్మక్క గారికి పె.సుబ్బరామయ్య నమస్కారములు.

మీరు వ్రాసిన letter చేరినది. ఎన్నాళ్ళు గా (హైదరాబాద్ లో) ఉంటున్నారు? ఈ విధంగా నైనా తమరు శ్రీ నాంపల్లిబాబా గారిని దర్శిస్తున్నారు. చాలా సంతోషం. వేసవి సెలవుల్లోనైనా శ్రీ స్వామి వారి దర్శనానికి ఒకసారి గొలగమూడికి రండి. శ్రీ సాయి మాస్టారు నిలయం చూడవచ్చు. శ్రీ మాస్టర్, శ్రీ సాయి, శ్రీ స్వామి వారి పటాలు పెట్టి అఖండ దీపం ఉంచాము. నిత్యం సాయంత్రం 6.30 నుండి 8.00 వరకు సత్సంగం. చాలా కొద్ది మందితో. ఎవ్వరు రాకుంటే ఇద్దరితో. ఎవ్వరిని పిలవటం లేదు. మిలారేపా చరిత్ర చదువుతున్నాము. అది కాగానే శ్రీ సాయి ప్రభోధామృతం, తర్వాత అవధూత భోదామృతం. శ్రీ మాస్టారికి నా మీద ఎంత దయో చూడండి. వారి నిలయాన్ని నిర్మించుకొని నా కోరిక ప్రకారం నా దగ్గరుండి గైడ్ చేస్తున్నారు. కాని నేనే మొద్దుబారి కాలం వృధా చేస్తున్నాను. ఈ మధ్య మూడు రోజులు మూడు సందేశాలిచ్చారు.



శ్రీ షిర్డీ సాయిబాబా




శ్రీ భరద్వాజ మాస్టర్



శ్రీ సుబ్బరామయ్య గారు



శ్రీ వెంకయ్యస్వామి



శ్రీ దర్గాస్వామి

**తొలి రోజు – ఇచ్చిన సదవకాశం సద్వినియోగం చేసుకోకుంటే బూడిదై రాలిపోతావు.**

**రెండవ రోజు- మాయ ఎవ్వరిని తనంతట తానుగా అతిక్రమించనివ్వదు. నీ ప్రత్యేక ప్రయత్నము ద్వారా మాయను అతిక్రమించాలి.**

**3వ సారి - సద్గురువును అక్కం వెంకటరామిరెడ్డి లాగా వెంబడిస్తే దైవ దర్శనమే గాక భుక్తికి కూడా కొరత లేదు.**

వారు నిత్య సత్యులని తన భక్తుల ఎదుట సర్వత్ర సర్వదా ఉన్నారని, పిలిచి పిలువక ముందే పలుకుతారని పై సందేశాల ద్వారా నిరూపించారు. **వారిని ఏమి కోరకుండా నిరంతరం నాకు తోడుగా ఉండి నన్ను మీ ఇష్ట మొచ్చినట్లు నడపండి. ఏది ముందు కోరాలో ఏది వెనుక కోరాలో తెలియని బుద్ధి హీనుడను అని మాత్రం ప్రార్థన చేస్తున్నాను.**

అక్కయ్యా! ఎంత గొప్ప పుణ్యం చేసినామో గాని మనందరం మాస్టారికి సన్నిహితులము అయినాము. ఇక జన్మకు ఏమి అక్కర లేదు.

**బాబు! ఏ పనైనా సక్రమంగా చేయాలంటే మన చేతిలోని పనిముట్టు IMPLIMENT మంచిదిగా ఉండాలి. అది ఎంత మంచిదైతే మనం పని అంత చక్కగా చేయగలుతాము. ఈ శరీరంతో మనం భగవంతునికి సేవ చేసి తరిస్తాము. ఇంజనీరు తన మేధా సంపత్తితో సేవిస్తే కార్మికుడు తన కండ బలంతో సేవిస్తాడు**. ఎక్కువ తక్కువలు లేవు. **గనుక నీవు నీ మెదడుకు మేత బెట్టి చక్కని ఇంజినీరు అయితే నీ ద్వారా దేశము అనబడు దైవ కార్యానికి మంచి సేవ దొరుకుతుంది. గనుక ఇప్పుడు నీవు చేయవలసిన పూజ, ధ్యానం అంతా చదువే.** నీవు ధరించ బోయే IMPLIMENT పరికరాన్ని బాగా పదును పెట్టుకొని చక్కని IMPLIMENT తయారు చేసుకోవాలి. అది భగవంతుడు మనకు నిర్దేశించిన పని. ఆ పని అత్యంత గొప్పగా నెరవేర్చేటట్లు చేయమని శ్రీ నాంపల్లిబాబాగారిని ప్రార్థించు. **సత్ పౌరుడిగా నాకిచ్చిన కార్యాన్ని దేవునకు ఎంతో తృప్తి కలిగేటట్లు నెరవేర్చేటట్లు ఆశీర్వదించమని అడుగు. స్వార్థం నుండి దూరంగా ఉండి ధర్మాన్ని ఆచరిస్తూ, లోకంలో పొగడ్తలకు, కీర్తి - ప్రతిష్టలకు దూరంగా ఉండే**

**నిగ్రహం ప్రసాదించమని అడుగు. అడగడమే గాక సాధ్యమైనంత వరకు నీ వైపు నుండి హృదయ పూర్వకమైన కృషి చెయ్యి.**

**నీకు ఏ మాత్రం తీరిక ఉన్నా నాకు తెలిసిన మాస్టారు అనే పుస్తకం మరల మరల చదివి, శత్రు మిత్రుల యెడల సమభావం, మానావమానాలలో సమతుల్యంగా ఎలా ఉండాలో బాగా ఆలోచించి మాస్టారి ఆచరణ ఎలా ఉండేది చూచినేర్చుకో. చేతికి వచ్చిన ప్రతి పైసాను దుర్వినియోగం చేయకుండా సద్వినియోగం చెయ్యి. శ్రీ బాబాగారి దగ్గరకు పోయినప్పుడల్లా పై ప్రార్థన చెప్పుకొని నిశ్చలంగా బాబా రూపాన్ని ధ్యానిస్తూ వారి సన్నిధిలో సాధ్యమైనంత సేపు ఉండు. వారి సన్నిధిలో మాటలు మాను. అలా చేస్తే వారి సన్నిధి మనకు చక్కగా ఉపయోగ పడుతుంది.**

శ్రీ స్వామి వారి ఆశీస్సులతో

పెసల సుబ్బరామయ్య

*********** సద్గురు దేవా శరణం శరణం ************

21-07-2005 న సాయి కి: స్వామి కరుణవల్ల - మన ప్రార్థన లేకుండానే సర్వం జరిగిపోతుంది (part 1)

గొలగమూడి,

21-7-2005

Dear Sai !

శ్రీస్వామివారు ఎంతటి కరుణామయులో ఈ మాయ గప్పిన మనసు ఊహించలేదు. శ్రీసాయిమాస్టర్ నిలయం ఉండే తావులో ఇల్లుకట్టాలని శంకుస్థాపన గుంట త్రవ్వుతుంటే ఆరు అడుగులు త్రవ్వినా అంతా loose soil లే. నీరు విపరీతంగా ఊరుతుంటే మానేశాను.

అంకణం 500 రూపాయలకు కొని, వెయ్యి రూపాయలకైతే ఇస్తానన్న విజయభాస్కర్ అంకణము 500 రూపాయలకు ఇస్తానని లెటర్ వ్రాస్తే అది

ఖచ్చితంగా శంకుస్థాపన ముహూర్తం టైములోనే చేరడం శ్రీస్వామివారి దివ్యలీలే. ఆ స్థలం కొని ఇప్పుడు కాపురం ఉంటున్న ఇల్లు ఉండే చోట రెండు అంకణముల రూము వేయించాలని వాస్తు అతనిని పిలిస్తే, అతను వచ్చి ఇంటికి మొత్తం ప్లాను ఇస్తాను. నీ శక్తి ఉన్నంత వరకు కట్టుకో అని ప్లాను గీసి ఇచ్చాడు. మా మామ వచ్చి మొత్తం ప్లాను ప్రకారం పునాదులు కట్టు. మిగిలిన రెండు అంకణములు రూము వేసుకోడానికి డబ్బు చాలకుంటే వడ్డీ లేకుండా నేనే ఇస్తానని బలవంతం చేశాడు. సరేనని ప్లాను ప్రకారం సున్నం పోసి పునాది తవ్వాలని ప్రయత్నిస్తే ప్లానంతా ఒకే బండ. మూడు అంగుళములు కూడా తెగలేదు. ఆ మార్గాన వెళ్లే బేలుదారు వచ్చి ఈ బండను పగలగొట్ట వద్దు, Plinth beam వేసి ఇల్లు కట్టు నాది జవాబు అని ప్రోత్సహించాడు. మామూలుగా బిల్డింగ్ అంతా ఒక లక్షరూపాయలు అయితే అందులో ఫౌండేషన్ కట్టే ఖర్చు రూ 25,000 ఉంటుంది. ఇప్పుడు నాకు రూ 25,000 మిగిల్చారు. బేలుదారికి కూలి ఇచ్చే పని లేకుండా పరంధామయ్య చేత చీటీలు పెట్టించి సుబ్బరామయ్యగారికి పనిచేయమని చెప్పారు. అతను కట్టబెట్టి అన్నం తిన్నాడే కానీ ఒక్కపైసా తీసుకోలేదు. కనుక కనీసం ఐదు వేల నుండి 10000 మిగిలాయి. విజయభాస్కర్ ను ప్రేరేపించి లెటర్ వ్రాయించడం, మా మామచేత ఇంటి ప్లానంతా పునాదులు కట్టమని, డబ్బు నేను ఇస్తానని చెప్పించి, పునాదులు కట్టాలని ప్రయత్నిస్తే బండ వల్ల పునాదులు కట్టే పనిలేకుండా చేశారు. పరంధామయ్యను బేలుదారుగా తీసుకువచ్చి ఆ ఖర్చు తప్పించాడు. U.T.I లో మెచ్యూర్ అయి డబ్బు రావడంతో బిల్డింగ్ అంతా ప్రహరీలు సహా, బావితో సహా తయారు చేయించిన మహనీయుడు. **మనకు ఆయా**

**సమయాలలో మనసు కష్టంగానే ఉంటుంది. కానీ అది మన మంచికే.** లక్ష్మక్కకు నమస్కారములు.

పెసల సుబ్బరామయ్య

********** సద్గురు దేవా శరణం శరణం ***********

22-07-2005 న సాయి కి: స్వామి కరుణవల్ల - మన ప్రార్ధన లేకుండానే సర్వం జరిగిపోతుంది (part 2)

గొలగమూడి,

22-7-2005

Dear Sai!

నిన్నటి లెటర్లో శ్రీ స్వామివారు నా ఇల్లు కట్టించిన విషయం వ్రాశాను. **అప్పుడు నేను యమతిండి తింటూ ఇద్దరు మనుషుల పని చేస్తున్నాను. కామాంధుడినై కన్ను కానని రోజులవి. ఒక్క సారైనా నా ఇల్లు కట్టే పనిలో సహాయము చేయమని నేను స్వామిని ప్రార్థించి ఎరగను. అంతా చేయ వలసింది మనమే గదా! వారేమి చేస్తారనే అహంకారము తలకెక్కిన రోజులు అవి. ఎసరు పెట్టి మనం మంట చేస్తే వంట అవుతుందనే వెధవ వేదాంతం.** బియ్యపుగింజ తయారుచేయటం మనకు చేత కాదనే విషయమే స్ఫురించని కామాంధపు రోజులవి. శ్రీ సాయిమాస్టర్ నిలయం ఉండేచోట శంకుస్థాపన గుంట కొంత త్రవ్వి పూడిపించారు. నా ప్రార్థన లేకనే వాస్తు ప్లాన్ గీసి ఇచ్చారు. నా ప్రార్థన లేకనే మా మామ పునాదులకు డబ్బు ఇస్తాను అని బలవంతం చేసాడు. నా ప్రార్థన లేకనే పరంధామయ్య బేలుదారిగా వచ్చాడు. నా ప్రార్థన లేకనే బిల్డింగ్ అంతా ఒకే ఒక బండ పడి

పునాదులు కట్టే పని ఖర్చు లేకుండా పోయింది. **మన ప్రార్ధన లేకుండానే సర్వం జరిగిపోతుంది. అది ఆ సద్గురుమూర్తి కృప. ఇంత జరిగినా ఇలాంటివి ఒకటి రెండు కాదు వందల అనుభవాలు జరిగినా ఈ మలిన మనసు నేటికైనా కుదురుగా ఉండమన్న చోట ఉంటుందా. అటు భవిష్యత్తునో లేక గతాన్నో యోచిస్తోంది. ఏమో దీన్ని ఆ సద్గురుమూర్తి ఎప్పుడు హతమార్చి కూర్చోబెడతాడో తెలియదు. తప్పక కూర్చో పెడతాడు. ఈలోగా ఇంద్రియలోలత్వం, ఆశ, సోమరితనం, జిహ్వా చాపల్యం, పరదూషణ, స్త్రీలోలత్వం అను నాలోని దొంగలను కనిపెట్టి తరిమే ప్రయత్నం చేయాలి. సిన్సియర్ ప్రయత్నం చేయాలి. శ్రద్ధ కాదు కేవలశ్రద్ధ అవసరమంటారు శ్రీ మాస్టారు గారు. శక్తినంతా వినియోగించి కృషి చేయమంటారు సాయి. లేకుంటే మానవ జన్మ పిడకలు ఏరుకునేందుకేనంటారు. అలాంటి దౌర్భాగ్యస్థితి కాకుండా వారిచ్చిన పని చేసే ప్రయత్నం సిన్సియర్ గా చేసి తరిద్దాం.** అక్క గారికి నమస్కారములు.

శ్రీ స్వామివారి కృప సదా మీకు ఉండాలని ప్రార్ధన.

పెసల సుబ్బరామయ్య


*********** సద్గురు దేవా శరణం శరణం ************


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దత్తాస్వామి



## First Step

ఎన్ని శాస్త్రాలు చదివినా ఇంకెన్నో స్తోత్రాలు చేసిన మనం చేయాల్సిన పని ఒకటే! అది అందరిలో ఆయన్ని చూడు అందరిలో ఆయన్ని చూడు అది మొదటి మెట్టు. అన్ని జీవులలో ఆయన సర్వాంతర్యామి అని గుర్తించు. సాయి లీలామృతం చదవంగా చదవంగా చదవంగా ఎన్ని మార్లు చదివినా ఆయన చెప్పేది అదే! ఆయన సర్వాంతర్యామి అన్ని చోట్ల ఉన్నాడు - పీట చెక్క కొయ్యలు రాళ్లు రప్పలు మట్టి గాలి. ఇందుగలడు అందు లేడు అను సందేహమ వలదు. అంతటా ఉన్నాడని గుర్తిస్తుండాలి నువ్వు. ఆ గుర్తింపు మనకు కలిగితే మనం మొదటి మెట్టులోకి వచ్చినట్టే! ఉదయం లేస్తే సాయంకాలం వరకు ఎన్ని మాట్లో మనకు అవసరమైనవి కాబట్టి ఈ నీళ్లు చేదుకుంటాం! నీళ్లతో నోళ్లు కడుగుతాం, మొహం కడుగుతాం, చేతులు కడుగుతాం, కాళ్ళు కడుగుతాం, స్నానం చేస్తాం, అన్నం వండుకుంటాం కానీ ఈ నీళ్లు భగవంతుడు అనేటటు భావన మనకు ఒక్క తూరి కూడా రాదు! ఏదో పారబోసేస్తుంటాం అంతే! నరసోబావాడి పోతే దేవుడికి హారతి ఇచ్చినమైన ఆ ఎదురుగుండా ఉంది నది! ఆ నదికి హారతిస్తారు. దేవునికి నివేదన ఇచ్చిన తర్వాత ఆ నదికి సమర్పిస్తారు ఆహారాన్ని! కాబట్టి వారికి తెలిసినా తెలియకపోయినా ఈ ప్రిన్సిపుల్స్ అన్ని అది ఆచారంగా ఆదిగా అనాదిగా చేస్తూనే ఉన్నారు. ఇంతకు ముందు ఉన్న మహనీయులు అందరూ అలా చేయించారు వాసుదేవానంద సరస్వతి కొన్నాళ్లు అక్కడ ఉన్నారు, ఆయన అలా చేయించారు. కనుక మనము అనుక్షణం ఆయన్ని గుర్తిస్తూ ఉంటే తక్కినవన్నీ అవే వస్తాయంట ఎట్లా

వస్తాయి? రాగద్వేషాలు నశిస్తాయి. ఈ ఎదుటి వ్యక్తి మనల్ని ప్రకోపింప చేస్తున్నాడు. తిడుతున్నాడు లేదా ఏదైనా అపకారం చేయటానికి ప్లాన్లు వేస్తున్నాడు లేదా చేస్తున్నాడు. అప్పుడు మనము ఏమని భావించాలా? ఈ వ్యక్తి మాత్రమే భగవంతుడు ఆయన చేసేవన్నీ ఋణానుబంధాన్ని అనుసరించి చేస్తున్నాడు.పూర్వజన్మ ఋణానుబంధం ఉంది ఋణానుబంధాన్ని గుర్తించు ఏ ప్రాణి తరిమి వేయకు! తరిమి వెయ్యకు అంటే దేయ్ అని వెళ్లగొట్టడం కాదు వాడు మనకు శత్రువు అని భావించడం కూడా ! ఋణానుబంధాన్ని గుర్తిస్తే వాడు మన శత్రువు అని భావించలేం! వాడు ఏం చేశాడు? పాపం వాడి పట్ల మనం పూర్వజన్మలలో ప్రవర్తించినటు వంటి ప్రవర్తనే ఇప్పుడు వాడిలాగా మనకి కనబడుతున్నాయి. అది మరిచిపోతాము. వాడిట్లా చేశాడు వీడిట్లా అట్లా చేశాడు వారిట్ల చేశారు వీరి ఇట్లా చేశారు. అందుకే పునరపి జననం పునరపి మరణం పునరపి జననం పునరపి మరణం !

మన బిడ్డలు కొంచెం ఎక్కువ సేపు పని చేసి వస్తే ఎండలో నుంచి ఎన్ని ఉపచారాలు చేస్తాం! ఆ! వేడి నీళ్లు తోడు, తుడుచుకోవడానికి గుడ్డ ఇవ్వు ఇన్ని చేస్తాం! మరి మనకి వచ్చి పని చేసి పోయేటటువంటి కూలి వాళ్లకి మనమేం చేస్తున్నాము? భగవంతుడే మన దగ్గరికి వచ్చి అంతసేపు పని చక్కబెట్టి వెళ్ళాడు. ఏమి చెయ్యం! ఇంకా కొంచెం సేపు చేయలేదని మాత్రం మాట పెడతాం!ఇట్లా ప్రతి అంశములోనూ ఆయన్ని గుర్తిస్తూ ఉంటే మొదటి మెట్టు ఎక్కినట్టు! ఆ తర్వాత మెట్టు- నువ్వు మనసును స్వాధీనంలో పెట్టుకోవటం. స్వాధీనంలో పెట్టుకొని ఈ మెట్టు ఎక్కినామైన అంతా పూర్తి అయిన తర్వాత దాన్ని చేయాలి అని ఏమీ లేదు. రెండు ఆటోమేటిక్గా

జరుగుతూ ఉండాలంట! మనసును కంట్రోల్లో పెట్టుకో! పరి పరి విధములు పోనీయవద్దు. జరిగేది జరగక తీరదు. జరగనివి ఎంతమంది వచ్చినా జరగవు. అది రమణ మహర్షి వాక్యం! జరిగేది జరగక మానవు, జరగనివి ఎంతమంది చెప్పినా జరగదు. అది గుర్తుపెట్టుకుంటే ఇక ప్లాన్లు వేసేదే లేదు. భవిష్యత్తులో ప్లాన్లు వేయటం ఉండదు. ఒక అమ్మిడి వరుసగా అనుభవాలు ఇస్తున్నా మన వక్రబుద్ధికి అది ఎన్నో జన్మల నుండి అలవాటైపోయింది పిచ్చి ఆలోచనలు! అది కంట్రోల్ లోకి రావటం కష్టం, కానీ కంట్రోల్ లోకి రావటం కష్టం అంటే ఆయన ఒప్పుకోడు. నువ్వు చేసిందేదీ? ఏది నీ ప్రయత్నం ఏది చూపించు? నువ్వు ఒక్క అడుగు వేస్తే పది అడుగులు వేస్తానన్నాడు. ఒక్క అడుగు వేయటం కాదు, ఒక్క అడుగు వేసే ప్రయత్నం ఏది? అది అడుగుతాడు ఆయన. పైన వాటర్ ఓవర్ హెడ్ ట్యాంక్ పెట్టాలని వారం, 10 రోజులు అయిపోయింది తీసుకొచ్చి అవి పడేసి.


ఏమయ్యా అని ఫోన్ చేస్తే మా అల్లుడికి, 'నువ్వు ఆ యాంగులర్స్ బిగించు తర్వాత ఆయన వస్తాడు. యాంగులర్స్ ఆయన వచ్చిన తర్వాత బిగించాలంటే రెండు రోజుల పని అవ్వద్ది, ఈ తడవ ఒక్కరోజుతో పోతుంది' అంటాడు.

ఇది అయ్యేదేనయ్యా మాకు చేత వచ్చునా వాడు వస్తే ఏమంటాడోనే అని నేను రకరకాలుగా అనుకుంటే అదేం లేదు, శివరత్నానికి తెలుసు, ప్రసాద్ కి తెలుసు వాళ్ళు వచ్చి బిగిస్తారు లే! వాళ్ళు బిగిస్తారులే అంటే అది ఇక వచ్చే వారం ఆదివారం వస్తే కదా వస్తాడు ప్రసాద్. సరేలే అని శివరత్నం చేత ఫోన్ చేయించినా "ఏమయ్యా ఒక గంట సేపు వచ్చి పని చేసి

పోకూడదయ్య!" ఫోన్ అందటమే వెంటనే వచ్చేసాడు. ఆడ ఏదో ఆటో ఉందట ఆటోలో వచ్చినాడు. అన్నీ ఆయన చేస్తున్నాడు. ఆటోలో వచ్చినాడు ఆ పని పూర్తి చేసి పోతున్నాడు. నేను ఇక వారానికి ఆ పని పూర్తి అవుతుందని నేను అనుకున్నా! మరి ఆయన చేస్తున్నాడు మనం నిమిత్తమాత్రులుగా ఫోన్ చేయటమే! నేను చేయబట్టి వచ్చింది అనుకుంటే అది అహంకారం. ఆయనే చేయిస్తున్నాడు, ఆయనే చేయిస్తున్నాడు. కనుక ఆయన ఒక పక్క ఇచ్చే అనుభవాలను మనం గుర్తిస్తుండాలి ఇది ఆయన చేసినది మనం చేసినది కాదు అని. అలా గుర్తిస్తూ ఉంటే మన అహంకారం చస్తుందంట! ఆయనే చేస్తున్నాడంటే. చేయలేదు ఒకరోజు పిలిస్తే కూడా రాలేదు . ఆయనకు ఇష్టం లేదు రక్షించల! ఈ రోజు ఇష్టమైంది రక్షించాడు అనుకోవాల్సిందే గాని అవతల వారిని నిందించటం తగదు అంటాడు. పని విషయంలోనే కాదు ఎవడైనా మనకు అపకారం చేసే వాడి విషయంలో కూడా మనం అట్లానే తలంచవలెను. ఋణానుబంధం వలన అట్లా అపకారం చేస్తున్నాడు ఇప్పుడు అతనికి పుట్టిన బుద్ధులు కావు అవి. మన పూర్వజన్మ కర్మలే అతని చేత అపకారం చేయిస్తున్నాయి అని మనం గుర్తిస్తూ, నిరంతరం ఆయనే స్మరిస్తూ ఆయన యొక్క అంతర్యామిత్వాన్ని గుర్తిస్తూ ఉంటే మన అహంకారం అహంకారం తగ్గుతుంది. ఈ అహంకారం తగ్గినప్పుడు ఆయన మనకు మనసుని కుదుటపరుస్తాడు. అహంకారం చావనిదే మాత్రం మనసు కుదుటపరచడు. కుదుట పడదు అసలు. నువ్వు ఊరికినే చేసుకుంటూ ఉండాల్సిందే! భరద్వాజ మాస్టర్ చెప్తాడు నువ్వు ఎన్ని రోజులు పూజలు చేసినా వ్రతాలు చేసినా, "రామ రామ కృష్ణ కృష్ణ", "ఓం నారాయణ ఆదినారాయణ" అని చెప్పినా నీ మనసు








కుదుట పడదు అని తీర్పు చెప్పేసినడు ఆయన. చేస్తూ ఉంటే ఈ జన్మంతా, రాబోయే జన్మల్లో చేస్తూ ఉంటే ఏమీ కుదుటపడదు ఇంకా రవ్వంత పెద్దవి కలుస్తూ ఉంటాయి. ఏమిటవి? ఋణాను బంధాలు. అయితే ఎప్పుడయ్యా? అవగాహనతో చేస్తూ ఉంటే అప్పుడు మాత్రం ఏదైనా వస్తుందంట! అవగాహన ముఖ్యము, అవగాహన ముఖ్యము ఏమిటి అవగాహన? మనకు జరిగే అనుభవాలన్నీ ఋణానుబంధం అనుసరించే జరుగుతున్నాయి. ఆయన జరిపిస్తున్నాడు. అది అవగాహన. ఆ అవగాహన ఉండే వాడికి ఎప్పుడైనా గాని వంద పాలు చేస్తే ఒక్క పాలైన గాని వస్తది! అసలు అది కూడా రాకుండా "ఓం నారాయణ ఆదినారాయణ" అనుకుంటూ ఉంటే బయటికి వచ్చి తగులు పెట్టుకుంటూ ఉంటే వీడికి కొత్తవి పెరుగుతున్నాయి ఎక్కువగా! పాతవి పోవాల్సింది కొత్తవి ఎక్కువ వస్తున్నాయి. ఏం ప్రయోజనం? కనుక అవగాహనని పెంచుకో. అవగాహనని పెంచుకో, అవగాహనను పెంచుకుంటే నీకేమైనా వస్తది. అవగాహన ఏమిటంటే అంతా ఆయనే చేస్తున్నాడు. మనకు అహంకారం ఉండటం అనేది చాలా తప్పు. చేసేది ఆయన! అందుకే రమణ మహర్షి ఆ మాట అన్నారు: ఎవరెన్ని చెప్పినా, జరిగేది జరగక మానదు. ఎవరు అడ్డాలు పెట్టినా అది జరిగే తీరుతుంది. చెయ్యాలా ఇది నెట్టాలా అని వెయ్యి మంది కాదు లక్ష మంది వచ్చినా కానీ అది జరగదు. కనుక మన అనుభవాలన్నిటినీ పరామర్శించుకోవాలంట! వెనక్కి తిరిగి చూసుకోవాలి అంట! జరగాల్సింది జరగద్దిలే అని చెప్పి మనల్ని గమ్మున ఉండమనరు. నువ్వు చేయాల్సినటువంటి ప్రయత్నం, నువ్వు చేయాల్సినటు వంటి కర్మ కొంత ఉంటుంది. ఆ కర్మ చేసి తీరాల నువ్వు! కర్మ చేయకుండా నువ్వు అట్లనే

దాటేస్తే, ఇది మళ్ళా వచ్చే జన్మకు ఉంటుందంట. నువ్వు చేయాల్సిన కర్మ నువ్వు చేయకుండా ఇట్టనే ఉంటే ఆ కర్మ వచ్చే జన్మకైనా మరలా చేయాల్సి ఉంటుంది. కాబట్టి నీ ప్రయత్నాలన్నీ పూర్తిగా చెయ్! ఎన్ని విధాల ప్రయత్నాలు ఉంటే అన్ని విధాలా చేయాలి. ఫలితం మన చేతిలో లేదు. ఆయన ఇష్టం! కాలేదే, ఇది కాలేదే, వెంకయ్య స్వామి ఇది కాలేదే ఎందుకు మొక్కోవటం వెంకయ్య స్వామికి? నన్ను అడిగితే ఒక స్థితిలో ఏమీ మొక్కుకోబళ్లా! పోనీవయ్యా, పోతే పోతుంది వస్తే వస్తుంది అని ఉండటమే. కానీ ఒక్కొక్కప్పుడు చాలా క్లిష్టమైన పరిస్థితులు వస్తయి. వచ్చినప్పుడు మొక్కుకో! తప్పేమిలా! కానీ ఆయన చేసినాడని కొనా వరకు గుర్తుపెట్టుకో! నీ వల్ల కాలేదు అది, ఆయన వల్లనే అయింది అనేది గుర్తుపెట్టుకో. అనుభవించిన తర్వాత, ఆ మొక్కుబడి తీర్చేసిన తర్వాత ఇక ఆయన్ని తలచరు. అది వచ్చిన ఇబ్బంది అంతా. అనుభవం వచ్చింది. రోగం వచ్చింది. రోగం నుండి రక్షించినాడు ఆయనేను అని చెబుతాడు. ఇక మరల మాత్రం ఆయన మాటే అనుకోడు. అదేమీ అంటే నాకేమీ తెలియలేదు అంటాడు. అది ఆ తెలియలేదు అనేకాడికి తెలుసుకొనేదానికి అవగాహన పెంచుకో! అవగాహన పెంచుకోవాలి అంటే సాయిలీలామృతం చదువు, ప్రబోధామృతం చదువు. ఊరికినే గడగడ గడ అని చదివేసేది కాదు. గడగడా అని చదివితే ప్రయోజనం లే! విడమరుచుకుని ఈరోజు ఏమి చదివినాము అని మరలా మనసుకు తెచ్చుకో! అలా చేస్తూ ఉంటే అవగాహన పెరుగుతుంది. అవగాహన పెరిగినప్పుడు మనం చేసేటటువంటిది బాగా తగ్గిపోద్ది. నేను చేస్తున్నా అనే భావం తగ్గిపోద్ది.


**శ్రీ సచ్చిదానంద సద్గురు భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి మహారాజ్ కీ జై!**


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దత్తాస్వామి

## మహాత్ముల వాక్యాలు

- సంసార సాగరము దాటుట యనగా జరుగుచున్న సంఘటనల నడుమనుండి వానిలో మునుగక దర్శించగలుగుటయేగాని వానిని విడిచిపోవులకు యత్నించుట కాదు.
- సంసారము అనగా పరిసరములను గూర్చి జీవులకు ఏర్పడు భావముల అల్లిక. అది భావించుటను బట్టి యేర్పడుట, మాయమగుట యుండును.

మాస్టర్ ఇ.కె.

We must organize our forces not to make a sect - not on religious matters, but on secular business part of it. A stirring propaganda must be launched out. Put your heads together and organize.

The term organization means division of labour. Each does his own part and all the parts taken together express an ideal of harmony.

The secret of success is there; to pay as much attention to the means as to the end.

Numbers do not count, nor does wealth or poverty; a handful of men can throw the world off its hinges provided they are united in - thought, word and deed; never forget this conviction.


**From the book : Organization and Organized Work by Sri Swami Vivekananda**


శ్రీ షిర్డీ సాయిబాబా


శ్రీ భరద్వాజ మాస్టర్


శ్రీ సుబ్బరామయ్య గారు


శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దర్గాస్వామి



**సద్గురు శ్రీ సుబ్బరామయ్య మహారాజ్ పాదుకలు**